క్లుప్తంగా

కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై హర్షం

కడప అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖలో ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయడంపై ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కడప నగర అధ్యక్ష, కార్యదర్శులు కె. చిన్నయ్య, శైలేశ్వరరెడ్డి, కోశాధికారి నాగార్జున రావు హర్షం వ్యక్తం చేశారు. 12వ పే రివిజన్ కమీషన్‌ను వేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌కు, తమ వంతుగా కృషి చేసిన ఏపిఎన్జీఓ అసోసియేషన్ రథసారథులు బండి శ్రీనివాసరావుకు, ప్రధాన కార్యదర్శి కేవీ శివా రెడ్డికి, రాష్ట్ర కార్యవర్గానికి, జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులకు అభినందనలు తెలియజేశారు.

బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియం బస్తాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మండలం పాలెం పల్లె గ్రామం నుంచి బచ్చుంపల్లికి వేల్లే దారిలోని చాపల గోడౌన్‌లో నిల్వ ఉంచిన 833 బస్తాల రేషన్ బియ్యాన్ని కడప తహసీల్దారు శివరామిరెడ్డి, డీటీ రోనాల్డ్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే లారీని సీజ్ చేశారు. దీంతోపాటు గోడౌన్‌కు సంబంధించిన చంద్రశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి బుధవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రమిచ్చారు. గుర్తింపుకార్డులు ఇవ్వడం వల్ల కౌలురైతులకు విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు, సబ్సిడీ వంటివి అందుతాయన్నారు. రైతు నాయకులు బాలచంద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం



సొసైటీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఆర్టీసీ కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వర రావు తెలిపారు. బుధవారం కడప డిపో మేనేజర్ కార్యాలయంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ గతనెల 14వ తేదిన ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శ్రమదానం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేశామన్నారు. చర్చి ఆఫ్ గాడ్ సంఘ సభ్యులు హృదయ పూర్వకంగా చేసిన సేవలను మెచ్చుకుని ఏపీఎస్ ఆర్టీసీ అప్రిసియేషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్నామన్నారు. సంఘం సభ్యులు ఎబినేజర్, చంద్రకళ,శ్రీలక్ష్మి, సులోచన, రత్న, లలిత, బాలయ్య, నోవహు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గాను దర్శించుకున్న శివమణి



కడప కల్చరల్: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన కడప పెద్దదర్గాలో సినీ సంగీత ప్రముఖుడు డ్రమ్మర్ శివమణి బుధవారం ప్రార్థనలు నిర్వహించారు. పూలచాదర్‌ను గురువుల మజార్ వద్ద సమర్పించారు. ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు.

సైనిక్‌స్కూల్ ఫలితాల్లో ప్రతిభ



కడప ఎడ్యుకేషన్ : ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో కడప నగరానికి చెందిన నలుగురు విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించి సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికయ్యారు. కడప నగరంలోని బాలవికాస్ సైనిక్‌స్కూల్ కోచింగ్ సెంటర్‌లో బుధవారం సైనిక్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ సైనిక్‌స్కూల్‌లో సీటు సాధించడం అంటే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకున్నట్లే అన్నారు. డైరెక్టర్ గంగయ్య, సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ధరణి కుమార్ మాట్లాడారు. 62 మంది విద్యార్థులు సైనిక్‌స్కూల్ ప్రవేశపరీక్షకు హాజరుకాగా 58 మంది విద్యార్థులు అర్హత సాధించగా, కౌన్సిలింగ్‌లో నలుగురు విద్యార్థులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. అనంతరం సైనిక్‌స్కూల్‌లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు.

రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలి



దేవునికడప రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అంబేద్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్, దేవునికడప రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్– వై జంక్షన్ మార్గంలో ఇచ్చిన మార్కింగ్ ప్రకారం పనులు త్వరగా పూర్తి చేయాలని, 80 అడుగుల రోడ్డు కొలతలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డ్రైన్ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. దేవునికడప రోడ్డులో ఇంకా ఎవరికైనా టీడీఆర్ బాండ్లు, పేమెంట్ వంటివి రాకపోతే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణలు తొలగించేటప్పుడు వ్యర్థాలు కాలువల్లో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, టీపీఎస్ చంద్ర, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

శాటిలైట్ సిటీలో పర్యటించిన ఎమ్మెల్యే, నగర కమిషనర్

చెన్నూరు : మండల పరిధిలోని శాటిలైట్ సిటీలో కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, కడప నగర కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ బుధవారం పర్యటించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇటీవల శాటిలైట్ సిటీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో నగర పరిధిలో వున్న ఇక్కడి ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని నగర కమిషనర్‌కు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు బుధవారం కమిషనర్‌తో ఆయన కలిసి పర్యటించారు. ముఖ్యంగా కాలనీలో ఏర్పాటు చేయాల్సిన డ్రైనేజీ, రోడ్డు నిర్మాణాలను గురించి స్థానిక ప్రజలతో ఆరా తీసి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు మొదలైన అంశాలను గురించి చర్చించారు. త్వరలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు



అరవేటిపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గడప గడపకు చేరాయని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని అరవేటిపల్లె, బారెడ్డిపల్లె, చావలి, బుడ్డాయపల్లె, బుడ్డాయపల్లె దళితవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పింఛన్, రేషన్ కార్డులు, గృహాలు రాలేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అరవేటిపల్లె గ్రామంలో సీసీ రోడ్డు, విద్యుత్ లైన్లు కిందలో ఉన్నాయని, చావలిపల్లెలో ఉపాధి పనులు కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులు తక్షణం ప్రతిపాదన పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఆగ్రోకార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతోష్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై జెడ్పీ సీఈఓ ఆరా



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

చెన్నూరు : స్థానిక గ్రామపంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆరా తీశారు. బుధవారం చెన్నూరు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన సీఈఓ అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులపై ఎంపీడీఓ సురేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకం (ఎస్ఏడీవై) కింద కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చెన్నూరు గ్రామ పంచాయతీని దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ పథకం కింద 56 పనులను రూ.కోటి 78 లక్షలతో పనులుచేసేందుకు ఎంపిక చేశారు. వాటికి సంబంధించిన పనులను 2019–2020లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని వాటికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేసేందుకు తగిన చర్యలు చేపట్టామని ఎంపీడీఓ సీఈఓకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగనపల్లె సురేష్‌బాబు, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ చార్జీల పెంపుదలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలను పెంచి సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలను మోపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అఫ్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఎం నాయకులు చంద్రారెడ్డి, ఫరూక్ హుస్సేన్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని కార్పొరేట్ పాఠశాలల్లో ముందుగానే అడ్మిషన్లు జరుగుతున్నాయని, వీటిని అడ్డుకోవడంలో జిల్లా విద్యాశాఖాధికారులు విఫలమయ్యారని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కత్తి ఓబులేసు, ఇండ్ల జయరాజు, బి.ఓబులేసు ఒక ప్రకటనలో ఆరోపించారు ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా డీఈఓ, ఎంఈఓ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, జర్నలిస్టు, వికలాంగుల పిల్లలకు ఫ్రీ సీట్లు కల్పించాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 1 నుంచి 10వ తరగతి వరకు ఉచిత విద్యను అందించాలని కోరారు.

ఓపీఎస్ ఇవ్వాల్సిందే

కడప ఎడ్యుకేషన్ : ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి పాత పెన్షన్‌విధానమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మెన్ మాదన విజయ్‌కుమార్, సెక్రటరీ జనరల్ షేక్ మహమ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీపీఎస్ స్థానంలో జీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కడప కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రతిపాదన గతంకంటే కొంత మెరుగైనప్పటికి రిటైరైన ఉద్యోగికి పూర్తిస్థాయి భద్రతను ఇవ్వదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పునరాలోచించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాషా, రూటరాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన బుచ్చిగాళ్ల జయాకర్ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఈ సమాచారాన్ని ఎంపీటీసీ రఘురామిరెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన పోచిమరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి ఎంపీడీఓగా జగన్‌మోహన్ రెడ్డి

పెండ్లిమర్రి : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బైరెడ్డి వెంకట జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూల్ జిల్లా కౌతాళం మండలంలో ఏఓగా పని చేస్తూ పదోన్నతిపై పెండ్లిమర్రి ఎంపీడీఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానన్నారు.

గోపినాథ్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



ఈడీ గోపినాథరెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా గోపినాథ్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని కడప, కర్నూలు, నంద్యాల రీజినల్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి, వెంకట్రామం, శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కడప ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆఫీసర్స్ అసోసియేషన్, సూపర్‌వైజర్ అసోసియేషన్, అద్దె బస్సుల ఓనర్ల అసోసియేషన్ నాయకులు గోపినాథ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపినాథ్ రెడ్డి కడపజోన్‌లో ఆర్టీసీని లాభాల బాటలోకి పయనింపజేసేందుకు అనేక చర్యలు తీసుకున్నారన్నారు. జోన్ వ్యాప్తంగా ఆర్టీసీ స్లీపర్ బస్సులను తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందారన్నారు. వర్క్స్ మేనేజర్ అజ్మతుల్లా, కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ హరినాథబాబు, డిప్యూటీ సీఏఓ రమణారెడ్డి, డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి, డిప్యూటీ సీఎంఈలు అనంతపురం మోహన్‌కుమార్, కడప లక్ష్మిభాస్కర్, కర్నూలు రజియసుల్తాన, రమేష్‌బాబు, ఏపీఎం హరి, వివిధ డిపోల మేనేజర్లు, హయ్యర్ బస్సుల యజమానులు భాస్కర్, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ల అసోసియేషన్ అధికారులు సురేంద్ర కుమార్, గోవర్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సంస్థ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఈడీగా బాధ్యతలు స్వీకరించిన గిడుగు వెంకటేశ్వరరావు చైర్మన్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కడప–తిరుపతి మధ్య ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేశామని, అవి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, ప్రయాణికులకు అనుకూలంగా ఉండే విధంగా ట్రిప్పులను నడపాలన్నారు. అలాగే ఎలక్ట్రిక్ బస్సుల సేవలు ప్రయాణికుల మన్ననలు పొందేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, అందుకు ఆర్టీసీని లాభాలబాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ ఈడీ గోపినాథ్‌రెడ్డి, ఆర్ఎం గోపాల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంచి మార్గంలో నడవడం ముఖ్యం



చర్చి ప్రారంభోత్సవ వేడుకలో ఎమ్మెల్యే , రాయలసీమ బిషప్ వరప్రసాద్, పాస్టర్లు

రాజుపాళెం : దైవాన్ని పార్థించడంతో పాటు సమాజంలో సరైన మార్గాన్ని ఎంచుకొని జీవించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని కూలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా రూ.70 లక్షలతో నిర్మించిన సీఎస్ఐ చర్చిని, శిలాఫలకాన్ని ఎమ్మెల్యే రాచమల్లు, రాయలసీమ బిషప్ డాక్టర్ పెయ్యల ఐజాక్ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవుని మందిరంలో ప్రార్థన చేస్తేనే దైవానుగ్రహం కలుగుతుందని అనుకోవద్దన్నారు. వాటితోపాటు సమాజ అభివృద్ధి, ఇతరులకు సేవ చేయడం, ఇంకా చేతనైతే కొద్దోగొప్పో సాయం చేయడం నేర్చుకోవాలన్నారు. చర్చి నిర్మాణానికి తన వంతు సాయంగారూ.13 లక్షలు ఇచ్చానని, ఇదేదో మీతో లబ్ధిపొందేందుకు కాదని, దైవానుగ్రహంలో కాస్త తనకు చోటు దక్కుతుందన్నా ఆశతో ఈ సాయం చేశానని చెప్పారు. రాయలసీమ బిషప్ వరప్రసాద్ మాట్లాడుతూ అందరి సహకారంతో చర్చిని ఎంతో అద్భుతంగా నిర్మించామన్నారు. ఇంతటి నిర్మాణానికి సహాయ, సహకారాలు అందించిన ఎమ్మెల్యే రాచమల్లుకు ఆ ఏసుప్రభు దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ జ్ఞానానందం, ఫాస్టర్లు, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సంఘ పెద్దలు, కాలనీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

సఖ్యత లోపమే బలిజల బలహీనత



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్

కడప కల్చరల్ : జిల్లాలో 32 శాతం సంఖ్యాబలం ఉన్నా ఐక్యత లేకపోవడమే బలిజల అభివృద్ధికి ఆటంకంగా మారిందని కడప మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్ అన్నారు. బుధవారం కడప నగరంలోని అమరస్వామి కాంప్లెక్స్‌లో కడప నగర బలిజల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 32 శాతం బలిజలు ఉన్నారని, కానీ ఏరోజు సుమారైన పదవులు, రాజకీయ ప్రాధాన్యత సంపాదించలేక పోయారన్నారు. ఐక్యంగా ఉంటే అనుకున్నది సాధించుకోగలమన్నారు. తొలుత కడప నగర బలిజలు ఐక్యంగా సంఘాన్ని ఏర్పరుచుకుని ముందడుగు వేసి జిల్లా సంఘానికి స్ఫూర్తినివ్వాలని సూచించారు. ఈ కార్యకలాపాల కోసం అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఉన్న బలిజ సంఘాలను రద్దు చేసి కడప నగర బలిజ సంఘం పేరిట నగర బలిజలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. రెండు ,మూడు నెలల్లో పది వేల మందితో భారీ సమావేశాన్ని ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. స్థానిక బలిజ ప్రముఖులు చెన్నంశెట్టి మురళి మాట్లాడుతూ దామాషా ప్రకారం బలిజలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని, కార్పొరేటర్ నుంచి శాసనసభ్యుని వరకు జిల్లాలో అవకాశాలు కల్పించాలని, బలిజలు ఒక్కసారి ఐక్యంగా నిలిచి ఈ ప్రాధాన్యతను నిలబెట్టుకోగలిగితే రాష్ట్ర స్థాయిలో బలిజల దశ తిరిగే అవకాశం ఉందన్నారు. సీనియర్ బలిజ నాయకులు పీవీఎస్ మూర్తి మాట్లాడుతూ సరైన నాయకుడు ఉంటే జిల్లాలో బలిజలు రాజకీయ ప్రాధాన్యతను సంపాదించగలరన్నారు. దుర్గాప్రసాద్, హరిప్రసాద్, దాసరి శివప్రసాద్, సుంకర శ్రీనివాస్‌తోపాటు నగరానికి చెందిన ఇతర బలిజ సంఘాల నేతలు మాట్లాడారు. అడ్‌హక్ కమిటీ చైర్మన్‌గా ముగ్గురాళ్ల అమరప్పను పలువురు సిఫార్సు చేశారు.

ఊరూరా డిజిటల్ గ్రంథాలయం



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు జీను మహేష్‌బాబు

కడప కల్చరల్ : ప్రతి గ్రామంలో గుడి, బడి, గ్రంథాలయం ఉండాలన్నది ముఖ్యమంత్రి ఆశయమని, ప్రతి గ్రామంలో వైఎస్సార్ డిజిటల్ గ్రంథాలయాలకు శ్రీకారం చుట్టారని, మూడు దశల్లో 12779 డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో ప్రతి గ్రంథాలయానికి ఇంటర్నెట్ ఉంటుందని, వర్క్ ఫ్రం హోం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు జీను మహేష్‌బాబు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుధవారం కడప నగరం కొండాయపల్లెలోని కేంద్ర గ్రంథాలయ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదవడం మాకిష్టం కార్యక్రమం వేసవి సెలవుల్లోనూ, గ్రంథాలయ సంస్థల వారోత్సవాల్లో మాత్రమే కాకుండా విద్యార్థుల్లో నిత్యకృత్యంగా మారాల్సిన అవసరం ఉందని అన్నారు. చదవడం మాకిష్టం ప్రభుత్వం పిల్లల కోసం ప్రవేశపెట్టిన గొప్ప కార్యక్రమమని, దీంతో పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు, చదువు ద్వారా జ్ఞానం లభిస్తాయన్నారు. వారి దినచర్యలో చదవడం ఒక భాగం కావాలని, అప్పుడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయం సిద్ధిస్తుందని ఆయన వివరించారు. గ్రంథాలయాల వేసవి శిక్షణా శిబిరాల్లో పిల్లల్లోని సృజన శక్తిని వెలికి తీసేందుకు గల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో మాట్లాడారు. చిన్నారులు తాము నేర్చుకున్న కథలు, అందులోని నీతిని వివరించారు. తాము తయారు చేసిన బొమ్మలను, గీసిన చిత్రాలను చూపించారు. శిక్షణా శిబిరం నిర్వహణ పట్ల మహేష్‌బాబు సంతృప్తి వ్యక్తం చేశారు. దాతల నుంచి పుస్తకాలు, ఫర్నీచర్ కోసం ప్రయత్నించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, సిబ్బంది సుబ్రమణ్యం, శ్రీనివాసులు, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర గృహాన్ని సందర్శించిన జడ్జి



కడపలో ప్రభుత్వ బాలుర గృహాన్ని పరిశీలించి, పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప అర్బన్ : కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహాన్ని బుధవారం డీఎల్ఎస్ఏ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత తమ సిబ్బందితో సందర్శించారు. అక్కడి పిల్లలకు అందుతున్న వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. జాతీయ న్యాయసేవాధికారసంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015 వివరించారు. న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థ (ఎల్ఏడీసీఎస్), ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం సూపరింటెండెంట్ వీరయ్య, పిల్లలు పాల్గొన్నారు.

సాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ విజయలక్ష్మి

కడప అగ్రికల్చర్: ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగుకు ముందు ప్రతి ఒక్క రైతు ఖచ్చితంగా విత్తనశుద్ధి చేసుకుని పంటల సాగు చేసుకోవాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత సూచించారు. బుధవారం ఆత్మ ఆధ్వర్యంలో బ్యాక్ టెక్నాలజీ మేనేజర్లు(బిటిఎం), అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ల(ఏటీఎం)లకు శాస్త్రవేత్తల ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పంటలసాగుకు ముందు రైతులందరూ ఖచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. పంటలసాగుపై రైతులకు రైతు భరోసా కేంద్రాల పరిధిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్లు మురళీకృష్ణలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జాన్సన్, హర్షిత, ఎఫ్‌టీసీ డీడీఏ రమణారెడ్డి, ఎఫ్‌టీసీ ఏఓ పద్మజ పాల్గొన్నారు.

టీచర్ డైరీ, లెసన్ ప్లాన్ అమలు చేయాలి



ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులందరూ టీచర్ డైరీతోపాటు లెసన్‌ప్లాన్‌ను కచ్చితంగా అమలు చేయాలని డీఈఓ రాఘవ రెడ్డి సూచించారు. బుధవారం కడప డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘ నాయకులతో నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడారు. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీలో క్లాస్ టీచర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ విద్యలో వెనుకబడిన వారికి ఆగస్టు నెలాఖరు వరకు ఉపాధ్యాయులు వేమన జ్ఞాన ధార పేరుతో ప్రతి రోజు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. అలాగే జూన్ 11 లోపల ఉపాధ్యాయులు తమకు సంబంధించిన సమస్యలను గూగుల్‌ఫాంలో నమోదు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, 15 ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు

బద్వేలు అర్బన్ : లక్ష్మీపాలెంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి విమాన గోపురం, రాజగోపురం నూతనంగా నిర్మించిన సందర్భంగా నిర్వహిస్తున్న కుంభాభిషేక మహోత్సవాలల్లో భాగంగా బుధవారం ఉదయం ఆదిదేవత, గరుడ, అనంత, ఆంజనేయ దేవతా మూలమంత్ర హోమము, చక్రాబ్జమండల హోమం నిర్వహించి సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, ఆలయ ఈఓ సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు నాగమణి, చంద్రయ్య, పెద్దవీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్నగురవయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కామసముద్రం లక్ష్మీవెంకటవరప్రసాద్ పాల్గొన్నారు.